

పోరాడి సాధించిన అంగన్‌వాడీలకు జేజేలు

ప్రజాశక్తి - కాకినాడ

తమ హక్కుల కోసం సుధీర్గకాలం పోరాడి విజయం సాధించిన అంగన్‌వాడీలకు సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ జేజేలు పలికారు. అంగన్‌వాడీల నిరవధిక సమ్మెకు అండగా నిలిచిన కార్మిక సంఘాలకు, ప్రజాసంఘాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల జీతాల పెంపుదలకు అంగీకరించి ఒప్పందం చేసుకోవడం హర్షనీయమని, అంగీకరించిన అంశాలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం ఎటువంటి కక్షసాధింపులకు తావులేకుండా అడుగులు వేయాలని కోరారు. ఎస్మాను ధిక్కరించి అంగన్‌వాడీలు చేపట్టిన ఉద్యమం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకూ కొనసాగించాలని పిలుపునిచ్చారు.

అసౌకర్యాల చెరలో ప్లస్ టు

- తప్పని అధ్యాపకుల కొరత
- పూర్తిస్థాయిలో అందని పాఠ్యపుస్తకాలు
- సమీపిస్తున్న పరీక్షలతో ఆందోళనలో విద్యార్థులు

'పేరు గొప్ప ఊరు దిబ్బ' అన్నట్లుగా ఉంది ప్లస్ టు కళాశాలల పరిస్థితి. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నట్లు చేసిన ఊకదంపుడు ప్రకటనలు కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయి. ప్లస్ టు కళాశాలలను ప్రారంభించి ఏడాది కావస్తున్నా నేటికీ కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం అయ్యింది. ఒకపక్క అధ్యాపకుల కొరత, మరోపక్క పూర్తి స్థాయిలో అందని పాఠ్యపుస్తకాల సమస్యతో నెట్టుకొస్తున్న విద్యార్థులను సమీపిస్తున్న పరీక్షలు ఆందోళనకు గురిచేస్తున్నాయి.

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నట్లు పిఠాపురం బింంఆర్ ప్రభుత్వ హైస్కూల్లో 'ప్లస్ టు' (మహిళా జూనియర్ కళాశాలలు)ను గత విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించారు. కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా వీటిని అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. కానీ సౌకర్యాలు కల్పించడం మరిచిపోయింది. దాంతో గత ఏడాది ఇక్కడ కేవలం ఐదుగురు మాత్రమే ఎంపిసి, బైపిసి గ్రూపుల్లో చేరారు. ఇదే స్కూల్లో గత ఏడాది సుమారు 100 మంది వరకు పదోతరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి బయటకు వెళ్ళిపోయారు. ఈ ఏడాది కేవలం 16 మంది మాత్రమే చదువుతున్నారు. మొదటి సంవత్సరం 12 మంది ఉండగా ద్వితీయ సంవత్సరం కేవలం నలుగురు మాత్రమే ఉన్నారు.


కాకినాడ రూరల్ ఎపిఎస్‌పి హైస్కూల్లో ప్లస్ టు తరగతులు నిర్వహిస్తున్న భవనం

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నామని గొప్పలు చెబుతున్న సర్కారు ఆచరణలో మౌలిక సదుపాయాలను కల్పించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఇంటర్ చదివే పిల్లల కోసం జిల్లాలో ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలల్లో ప్లస్ టూ అంటూ ప్రారంభించిన మహిళా ఇంటర్ కళాశాలలను సమస్యలు వేధిస్తున్నాయి. దాంతో 'ప్లస్ టూ'లో చేరేందుకు బాలికలు ఏమాత్రం ఆసక్తి చూపించడం లేదు. జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి పెద్దాపురం మండలంలో 13 మంది, గొల్లప్రోలు మండలంలో 42, ఏలేశ్వరంలో 35, గండేపల్లిలో 24, యు.కొత్తపల్లి మండలంలో 65, జగ్గంపేటలో 34, సామర్లకోటలో 28, పిఠాపురంలో 16, కిర్లంపూడిలో 71, రౌతులపూడిలో 63, కాకినాడ రూరల్ లో 110, కరపలో 43, పెదపూడిలో 42, ప్రత్తిపాడులో 78 మంది చదువుతున్నారు. మొత్తంగా 14 కళాశాలల్లో 629 మంది చదువుతున్నట్లు విద్యాశాఖ అధికారులు లెక్కలు చెబుతున్నారు. అయితే ఇంటర్ మొదటి సంవత్సరంలో కొంతమంది చేరుతున్నప్పటికీ చాలామంది రెండవ సంవత్సరం వచ్చేసరికి ఇతర కళాశాలలకు మారుతున్నారు. ఇలా ప్రస్తుతం సుమారు 500 మంది మాత్రమే చదువుతున్నట్లు సమాచారం.

అసౌకర్యాల నడుమ చదువులు

కేవలం ఎంపిసి, బైపిసి గ్రూపుల్లో మాత్రమే అడ్మిషన్లకు అవకాశం కల్పించడంతో అనేకమంది విద్యార్థులు ప్రైవేటు కళాశాలలవైపు వెళుతున్నారు. ఆయా హైస్కూళ్లను విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక సతమతమవుతుంటే వాటిల్లోనే ఇంటర్ తరగతులను కూడా నిర్వహిస్తుండడంతో సమస్యలు వేధిస్తున్నాయి. మరోవైపు చాలా కళాశాలల్లో అధ్యాపకుల కొరత ఉంది. దాంతో ప్లస్ టులో చేరేందుకు విద్యార్థులు అంతగా ఆసక్తిని చూపలేకపోతున్నారు. మరోవైపు పూర్తి స్థాయిలో పుస్తకాల కూడా అందించలేని దుస్థితి నెలకొంది. అన్నిచోట్లా విద్యార్థుల సంఖ్యకనుగుణంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయలేక పోయారు. దాతల సహకారం తీసుకుని కొన్ని కళాశాలల్లో అధ్యాపకులు పుస్తకాలను సమకూర్చుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో గతేడాది ఉత్తీర్ణత దారుణంగా పడిపోయింది. చాలా మంది ఫెయిల్ అయ్యారు. ఈ ఏడాదైనా పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో ఇస్తారనుకుంటే అవి కూడా లేవు. మరో రెండు నెలల్లో పరీక్షలు ఉండనున్న నేపథ్యంలో ఉత్తీర్ణతపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్ని చోట్లా యూనిఫాం, మధ్యాహ్న భోజనం, హాస్టల్స్ సౌకర్యం, సరిపడా మరుగుదొడ్లు ఇలా కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు గగ్గోలు పెడుతున్నారు.

సౌకర్యాలు కల్పించలేదు



మా కళాశాలలో అదనపు తరగతులు గానీ, మరుగుదొడ్లు గాని పూర్తిస్థాయిలో లేవు. దాతలు ఇచ్చిన యూనిఫామ్‌ను ధరిస్తున్నాం. మధ్యాహ్న భోజన సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పాఠ్యపుస్తకాలు కూడా ఇవ్వలేదు. దాతలు ఇచ్చిన మెటీరియల్‌తో చదువులు కొనసాగిస్తున్నాం.

-పి.జయశ్రీ, ఎంపిసి, ద్వితీయ సంవత్సరం, ఎపిఎస్‌పి కళాశాల, కాకినాడ రూరల్

ల్యాబ్ సౌకర్యం కల్పించాలి



ఎంపిసి, బైపిసి గ్రూపుల విద్యార్థులకు తప్పనిసరిగా ప్రయోగాలు చేసేందుకు ల్యాబ్ సౌకర్యం ఉండాలి. రెండేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయలేదు. ఎలా చదవాలో అర్థం కావడం లేదు. పాఠ్యపుస్తకాలు కూడా లేకపోవడంతో ఇంటర్ చదువులపై బెంగ పట్టుకుంది. పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో అర్థం కావడం లేదు.

-బి.వరలక్ష్మి, ఎంపిసి, మొదటి సంవత్సరం, కాకినాడ రూరల్



లబ్ధిదారులకు మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ

ఆసరా పథకంలో రూ.1200 కోట్ల లబ్ధి

ప్రజాశక్తి - కాకినాడ

వైఎస్‌ఆర్ ఆసరా పథకంలో నాలుగు విడతలుగా సుమారు రూ.1200 కోట్లను డ్వాక్రా మహిళలకు లబ్ధి చేకూరిందని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. నాలుగో విడత కార్యక్రమాన్ని సిఎం జగన్ అనంతపురం జిల్లా ఉరవకొండలో మంగళవారం ప్రారంభించారు. వర్చువల్ విధానంలో కాకినాడ కలెక్టరేట్ నుంచి ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తితో కలిసి కలెక్టర్ డ్వాక్రా మహిళలకు మెగా చెక్‌ను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాలుగో విడతలో జిల్లాలో 37,525 గ్రూపులకు రూ.300.47 కోట్ల లబ్ధి చేకూరుతుందని తెలిపారు ఆసరా పథకం ద్వారా మహిళా సాధికారత మరింత మెరుగుపడుతుందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని పేద మహిళల యొక్క ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని తెలిపారు. వచ్చే రెండు వారాల్లో ఈ ఆసరా సొమ్మును మండలాల వారీగా స్థానిక ఎంఎల్‌ఎ ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో ఆయా పొదుపు సంఘాల మహిళల ఖాతాల్లో జమ చేసి అవగాహన కల్పించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పథకం ద్వారా పొదుపు సంఘాల మహిళలు తమ అప్పుభారాన్ని తగ్గించుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. దీని ద్వారా మహిళలు స్వసక్తితో ఎదిగేందుకు తోడ్పాటు అందించడంతోపాటు తమ వ్యాపారాలను వృద్ధి చేసుకునేందుకు సహాయపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ డిఆర్‌ఒ, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, మెప్మా పీడీ బి.ప్రియంవద పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

నియోజకవర్గ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేసినట్లు ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ తెలిపారు. మండలంలో సుంకరపాలెం, నీలపల్లి పంచాయతీల పరిధిలో ఒఎన్‌జిసి సిఎస్‌ఆర్ నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంకులను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కొరకు నియోజకవర్గంలో 90 వాటర్ ట్యాంకులు నిర్మించినట్లు తెలిపారు. నీలపల్లి గ్రామంలో 24 మందికి ఇండ్ల స్థలాలు కోర్టు కేసులో పెండింగ్లో ఉన్నాయని, వాటిని త్వరలో పరిష్కరించి వేరే ప్రాంతంలో వారికి స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఆయా గ్రామాల్లో జరిగిన సభలు సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు, నీలపల్లిలో వైసిపి నాయకుడు రెడ్డి సతీష్, మాజీ సర్పంచ్ రేవు మల్లేశ్వరి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి రాయుడు సునీత, వైసిపి మండల అధ్యక్ష కార్యదర్శులు కాదా గోవింద్ కుమార్, రాయుడు గంగాధర్, జడ్‌పిటిసి దొమ్మేటి సాగర్, దున్న జనార్దనరావు పాల్గొన్నారు.


ఓటర్ ట్యాంకు ప్రారంభోత్సవంలో ఎంఎల్‌ఎ పొన్నాడ


ఏలేరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న సత్యప్రభ

ప్రాజెక్టుల నిర్వహణలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు నియోజకవర్గంలో గల ప్రాజెక్టులు నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రతిపాడు నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సత్యప్రభ ఆరోపించారు.మంగళవారం టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఏలేరు రిజర్వాయర్, చంద్రబాబు సాగర్, సుబ్బారెడ్డి సాగర్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోదావరి జలాలను ఏలేరు రిజర్వాయర్‌కి తరలించేందుకు గత ప్రభుత్వం పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నిర్మించిందన్నారు. దీని ద్వారా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఏలూరు జలాశయానికి 16 టిఎంసిల నీరు తరలించేందుకు అవకాశం ఉన్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం పట్ల ఏలేరు జలాశయం నీటిమట్టం గణనీయంగా తగ్గిపోయిందన్నారు. ఏలేరు ఆయకట్టు కింద 97 వేల ఎకరాలు సాగులో ఉండగా, 5 మండలాల ప్రజలకు, పశువులకు నీటి సరఫరాతోపాటు విశాఖకు నీరు తరలించే అవకాశం ఉండగా ప్రభుత్వం సకాలంలో చర్యలు తీసుకోకపోవడం వలన రానున్న వేసవిలో నీటి ఎద్దడి ఎదుర్కోవాల్సి వస్తాదన్నారు. ఏలేరు రిజర్వాయర్, చంద్రబాబు సాగర్, సుబ్బారెడ్డి సాగర్ ఆధునీకరణ పనులు కనీసం పట్టించుకోలేదని ఆమె ఆరోపించారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - యంత్రాంగం

అంగన్‌వాడీల సుదీర్ఘ పోరాటం ఎట్టకేలకు ఫలితం ఇచ్చింది. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 42 రోజులపాటు ఇళ్ళ, వాకిళ్లను వదిలి రోడ్డుఎక్కి పోరాడిన అంగన్‌వాడీలు ఉద్యమానికి ఎట్టకేలకు దిగివచ్చింది. జీతాల పెంపునకు స్పష్టమైన హామీ ఇవ్వడంతో అంగన్‌వాడీల ఆనందానికి అవదులు లేకుండా పోయాయి. మంగళవారం జిల్లాలోని పలు కేంద్రాల్లో అంగన్‌వాడీలు కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకుని సంతోషాన్ని వ్యక్తం చేశారు. **కాకినాడ** రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన ప్రతి హామీకి సంబంధించిన జిఒలను వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జీ, జిల్లా కోశాధికారి మలక వెంకటరమణలు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ పక్కన గల అంగన్‌వాడీ శిబిరం నిర్వహిస్తున్న స్థలంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఆనందంతో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యమానికి రాష్ట్ర ప్రభుత్వం దిగి రావడంతో 42 రోజుల సుదీర్ఘ పోరాటం విజయంతో ముగించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీని అమలు చేయకపోయినా మళ్లీ పోరాడడానికి అంగన్‌వాడీలు సిద్ధంగా ఉన్నారన్నారు. అంగన్‌వాడీలు చేసిన పోరాటం యావత్ కార్మిక వర్గానికి ఉత్సాహాన్ని, ఊపుని అందించిందని, వీరి స్ఫూర్తితో మిగిలిన కార్మిక వర్గం వారి సమస్యలపై పోరాటాలు చేయలన్నారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా సిపిఎం జిల్లా కన్వీనర్ మోర్త రాజశేఖర్, కాకినాడ రూరల్ పార్టీ కన్వీనర్ టి.నాగేశ్వర రావు, ఐద్వా రాష్ట్ర నాయకులు రమణి మాట్లాడుతూ అంగన్‌వాడీల పోరాటం ఒక చారిత్రక విజయమన్నారు. మహిళా శక్తి ఏమిటో రాష్ట్రానికి కార్మిక వర్గానికి తెలిపారని చెప్పారు. అంగన్‌వాడీ ఉద్యమానికి మద్దతుగా నిలిచిన ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, మీడియా, పోలీసులు, వ్యాపారులకు, ప్రజలకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి రమణమ్మ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రూరల్ నాయకులు టి.రాజా, మేడిశెట్టి వెంకటరమణ, ఇబ్రహీం, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జ్యోతి, నీరజ, వీర వేణి, రమ, వ్యాపారమ్మ, మున్ని, విజయ అనురాధ తదితరులు పాల్గొన్నారు. **కాజులూరు** పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా కౌలు రైతుల సంఘం కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ వద్ద అంగన్‌వాడీల సమ్మె విరమణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మరోసారి రాష్ట్రంలో అంగన్‌వాడీలు తమ పట్టుదలను నిరూపించారని తెలిపారు. అంగన్‌వాడీల పోరాటం ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి జీతాల పెంపుదలకు హామీ ఇచ్చిందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకుని ఆనందోత్సవంతో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పత్తి ప్రసన్న, సలాది లక్ష్మి, నందికోళ్ల నాగమణి, పసుమర్తి సుజాత, కాదా సుజాత, రాయుడు సీత, జొన్నలగడ్డ సరోజినీ, లంక దుర్గా, తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** సమ్మె విజయవంతం కావడంతో అంగన్‌వాడీలు సంబరాలు చేసుకున్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న దీక్ష శిబిరానికి చేరుకున్న అంగన్‌వాడీలు సమ్మె విజయవంతం పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఒకరికొకరు స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీలు చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు అత్తిలి బాబురావు, విశ్వజన కళామండలి రాష్ట్ర నాయకులు వడ్డి ఏడుకొండలు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, సుందరపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు గోడి భాస్కరరావు, పినపోతు రాజు అంగన్‌వాడీలకు అభినందనలు తెలిపారు.


కాకినాడలో విజయోత్సవ సభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శేషబాబ్జి


తాళ్లరేవులో స్వీట్లు తిన్పించుకుంటున్న అంగన్‌వాడీలు


కాజులూరులో సంబరాలు చేసుకుంటున్న అంగన్‌వాడీలు


సమావేశంలో మాట్లాడుతున్న డిజిఎం ప్రకాష్

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మురారి గ్రామంలో ఆళ్ల సత్యనారాయణ ఆయిల్ పామ్ తోటలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డిజిఎం ఎఎస్.ప్రకాష్ ఆయిల్ పామ్ సాగు విస్తరణ, అధిక దిగుబడులు, గెలలు కోత మరియు నాణ్యత, పెర్టిగేషన్ ద్వారా ఎరువులు వాడకం విధానంపై మాట్లాడారు. ఫీల్డ్ ఆఫీసర్ జి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ చీడపురుగులు, తెగుళ్లు, నివారణ గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో మురారి గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్ కుమార్, కంపెనీ క్లస్టర్ ఇన్‌ఛార్జి ఎస్.వీర్రాజు, సిబ్బంది, ఆయిల్ ఫామ్ రైతులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ నాగ నరసింహరావు

పథకాలపై అవగాహన పెంచుకోండి

ప్రజాశక్తి - కాకినాడ

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలు అవగాహన చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు సూచించారు. స్థానిక రెవెన్యూ కాలనీ పార్క్, గొడారిగుంట ప్రాంతాల్లో మంగళవారం జరిగిన వికసిత్ భారత్ సంకల్పయాత్రలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, సిఎం స్వనిధి, ముద్ర, ఉజ్వల యోజన వంటి ఎన్నో పథకాలను కేంద్రం అమలు చేస్తోందన్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులు పథకాలను వినియోగించుకుని ప్రయోజనం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.యేసుబాబు, టిపిఆర్‌ఒ మానే కృష్ణమోహన్, బిజెపి నాయకులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, గట్టి సత్యనారాయణ, ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో సిఎం సహాయ నిధి పథకం ద్వారా ఐదు కుటుంబాలకు ఆ కుటుంబ సభ్యుల వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.7,68,500ల చెక్కులను వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు బాధితులకు అందచేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబాలకు సంబంధిత చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య సేవలు కోసం ఖర్చు పెట్టుకోలేని పేద కుటుంబాలను సిఎం సహాయ నిధి నుంచి ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట పెద్దాపురం మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్లు ఊబా జాన్ మోజేష్, నెక్కంటి సాయి ప్రసాదులు, కౌన్సిలర్లు సత్యనారాయణ, సురేష్ మర్రి శేషారావు, స్వయం భారపు భద్రరావు, కో ఆప్షన్ సభ్యులు సల్లూరి కళ్యాణ్, సొసైటీ అధ్యక్షులు మేకా శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న దొరబాబు

కార్టూ'నిజం'



ఇక్కడ కూడా అమ్మ భాషకు ప్రాణ ప్రతిష్ట చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది సార్..!!

ఉపాధి శిక్షణను ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతి డ్వాక్రా మహిళకు సుస్థిర జీవనోపాధి కల్పించే లక్ష్యంతో ఏర్పాటుచేసిన శిక్షణా కేంద్రాలను డ్వాక్రా మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర పిలుపునిచ్చారు. స్థానిక పాత పెద్దాపురం కోట వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన పట్టణ ప్రగతి యూనిట్ కంప్యూటర్ ఎంబ్రాయిడరీ వర్క్ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. మెప్మా పిడి పి.ప్రియంవద అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా జీవనోపాదుల సంస్థాగత అధికారి కె.మోహన్‌కుమార్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ సభ్యులకు సుస్థిర జీవనోపాధి కల్పించాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జగనన్న అర్బన్ మార్కెట్, ఆహా క్యాంటీన్లు, జగనన్న సి మార్ట్, వైఎస్‌ఆర్ ఆసరా, చేయూత, జగనన్న తోడు, సున్నా వడ్డీ వంటి పథకాల ద్వారా ప్రతి సభ్యురాలిని స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించేందుకు ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ పొందిన మహిళలకు ప్రతి యూనిట్ కు రూ 2.1 లక్ష ఆర్థిక సహాయం కల్పించి మెప్మా కార్యాచరణ చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా శివ జ్యోతి మహిళా సంఘం సభ్యురాలు బళ్ల వరలక్ష్మికి కంప్యూటర్ ఎంబ్రాయిడరీ యూనిట్ మంజూరయిందన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఎంఎంజి భ్రమరాంబ, సిఒలు వి.ఉమా పార్వతి, మున్సిపల్ కౌన్సిలర్లు ఆరేళ్ల వీరరాఘవ, విడదాసరి రాజా పాల్గొన్నారు.


శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, డిప్యూటీ చైర్మన్లు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు


క్రీడాకారులకు బహుమతులను అందిస్తున్న జడ్‌పిటిసి వెంకట సుబ్బారావు

ప్రజాశక్తి - కాజులూరు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జడ్‌పిటిసి వనుం వెంకట సుబ్బారావు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో విజేతలకు బహుమతులు ప్రధానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర క్రీడలను నిర్వహించిందని అన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 24, 27న రామచంద్రపురంలో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రత్నరాజు, ఇఒపిఆర్‌డి ఇందిరా దేవి, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, సూరిబాబు, ప్రతాప్‌కుమార్, మల్లెల శ్రీనివాస్, హేమాదేవి, తదతరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



ఎసిబికి చిక్కిన అధికారులు

ఎసిబికి చిక్కిన ఇరిగేషన్ ఇఇ, జెఇ

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ప్రగతి భవనంలో నీటిపారుదల శాఖకు చెందిన మురికి కాలువల విభాగం కార్యాలయంపై ఎసిబి అధికారులు మంగళవారం దాడులు చేశారు. ప్రయివేట్ డివిజన్ కార్యాలయంలో స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన పలివెల త్రిమూర్తులకు రావాల్సిన పింఛన్ల బకాయి నిమిత్తం ప్రయివేట్ డివిజన్ ఇఇ కొడాలి ఏడుకొండలు, జూనియర్ అసిస్టెంట్ కొల్లాటి స్వామి రూ.16 వేలు డిమాండ్ చేశారు. దీంతో ఆయన ఎసిబి అధికారులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే మంగళ వారం సంబంధిత అధికారులకు బాధితుడు లంచం ఇస్తుండగా ఎసిబి అధికారులు దాడి చేసి అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని రాజమహేంద్రవరం ఎసిబి కోర్టులో హాజరుపరుస్తామని డిఎస్‌పి శ్రీహరి రాజు మీడియాకు వెల్లడించారు. ఈ దాడుల్లో సిఐలు డి.వాసుకృష్ణ, వై.సతీష్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గడ్డిమేటు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని గోరింట గ్రామ శివారులోని నాని అనే రైతు పొలంలోని పశువుల శాల వద్ద ఉన్న పెద్ద గడ్డిమేటు మంగళవారం దహనం అయ్యింది. విద్యుత్ వైర్ల మధ్య షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. ఈ ప్రమాదం వార్త తెలిసిన వెంటనే పెద్దాపురం ఫైర్ స్టేషన్ సిబ్బంది హుటాహుటిన అక్కడికి వెళ్లి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ లక్ష వరకూ నష్టం సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

ఆరు కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి గ్రామ శివారులో 6 కేజీల గంజాయిని మోటార్ సైకిల్‌పై తరలిస్తుండగా సంబంధిత వ్యక్తిని అరెస్టు చేయడంతోపాటు, గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ లక్ష్మణరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం గ్రామానికి చెందిన షేక్ బాజీ బాబా విశాఖపట్నం వైపు నుంచి గుంటూరు వైపు వెళ్తున్నట్టు వచ్చిన సమాచారంతో ఎస్ఐ ఎన్.రామకృష్ణ సిబ్బంది తనిఖీలు చేపట్టగా నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ముద్దాయి షేక్ బాజీ బాబాను కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.

84 మద్యం బాటిల్స్ స్వాధీనం

ప్రజాశక్తి - కరప

మండలంలోని సావారం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నుంచి 80 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన వాసంశెట్టి సత్యనారాయణ యిబ్బా ప్రక్కల గ్రామాలలో ఉన్న వైన్ షాపుల నుంచి మద్యం బాటిల్స్ కొనుగోలు చేసి బ్లాక్‌లో అమ్మకం చేసేందుకు తన ఇంటి వద్ద దాచిపెట్టినట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు అతని ఇంటిని తనిఖీ చేయడగా 84 క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ముద్దాయిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేటి నుంచి చంద్రమాంపల్లిలో నాటిక పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చంద్రమాంపల్లి నేటి నుంచి 26వ తేదీ వరకూ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు స్నేహ ఆర్ట్స్ అధ్యక్ష, కార్యదర్శులు గొందేసి రాజా, ఇంధన బ్రహ్మానందం తెలిపారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ పోటీలను జడ్‌పి సిఇఒ రమణారెడ్డి ప్రారంభిస్తారన్నారు. ప్రారంభ సభలో డిఎస్‌పి పి.లతాకుమారి పాల్గొంటారన్నారు. మొదటి రోజు శ్రీకాకుళం జిల్లా బోరివంక శార్వాణి సాంస్కృతిక సంస్థ 'కొత్త పరిమళం', విశాఖ పట్నం తెలుగు కళా సమితి ఆధ్వర్యంలో 'నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత?' నాటికలు ప్రదర్శిస్తా రన్నారు. 25న గుంటూరు అభినవ ఆర్ట్స్ వారి 'ఇంద్రప్రస్థం', హైదరాబాద్ కళాంజలి ఆధ్వర్యంలో 'రైతేరాజు', సాయి రాఘవ మూవీ మేకర్స్ ఆధ్వర్యంలో 'కెరటాలు' అనే నాటికలు ప్రదర్శిస్తారని తెలిపారు. 26 న కరీంనగర్ చైతన్య కళాభారతి ఆధ్వర్యంలో 'స్వప్నం రాల్చిన అమృతం', హైదరాబాద్ మిత్రా క్రియేషన్స్ ఆధ్వర్యంలో 'లక్ష్మణ రేఖ దాటితే', పి రాయవరం సహృదయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నేరస్తులు నాటికలు ప్రదర్శిస్తారన్నారు. ఈ నాటిక పోటీలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

29 నుంచి రైళ్ల దారి మళ్లింపు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

విజయవాడ రైల్వేడివిజన్ పరిధిలో ట్రాక్ కారిడార్ పనులు నిర్వహిస్తున్న దృష్ట్యా ఈనెల 29 నుంచి విజయవాడ - విశాఖ మధ్య రాక పోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించినట్లు రైల్వే సీనియర్ ఏరియా ఇన్‌ఛార్జ్ ఎ.సురేష్ రెడ్డి, సామర్లకోట రైల్వేస్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. నెం.13351 ధన్బాద్-అలెప్పీల మధ్య నడిచే బొకారో ఎక్స్‌ప్రెస్ రైలు 29 నుంచి ఫిబ్రవరి 25 వరకూ నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడ చేరుతుంది. నెం.12835 హతియా-బెంగళూరుల మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 30న, ఫిబ్రవరి 4, 6, 11, 13, 18, 20, 25 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడ చేరుతుందన్నారు. నెం.18637 హతియా-బెంగుళూరు మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 3, 10, 17 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుందన్నారు. నెం. 22837 హటియా-ఎర్నాకుళం మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 29, ఫిబ్రవరి 5, 12, 19 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుందని, నెం.181 11 టాటా-యశ్వంత్‌పూర్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 1, 8, 15, 22 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. నెం. 12756 భావనగర్-కాకినాడ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 3, 10, 12, 19 తేదీల్లో విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్ మీదుగా నిడదవోలు చేరు తుంది. నెం. 18637 హతియా-బెంగుళూరు మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 3, 10, 17, 24 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడకు చేరుతుందన్నారు. నెం.22837 హటియా-ఎర్నాకుళం మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 29, ఫిబ్రవరి 5, 12, 19 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. నెం.18111 టాటా-యశ్వంత్‌పూర్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 1, 8, 15, 22 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. నెం.12756 భావనగర్- కాకినాడ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 3, 10, 12, 19 తేదీల్లో విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్ మీదుగా నిడదవోలు చేరుతుంది. నెం.110 19 ముంబై భువనేశ్వర్ మధ్య నడిచే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 29, 30 ఫిబ్రవరి 2,3,5, 7,9,10, 12,14,16,17,19,21,23,24 తేదీల్లో విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్ మీదుగా నిడదవోలు చేరుతుందన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని రైల్వే బుకింగ్ కార్యాలయంలో సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

ఆదిత్య డిగ్రీ కళాశాలలో దేశభక్తి దినోత్సవం



సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆదిత్య ప్రతినిధులు

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో దేశభక్తి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ చిత్ర పటానికి అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బివిఎస్ఎల్.నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైనా ఆయన ఆ పదవికి రాజీనామా చేసి నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి పోరు బాటలో నడిచిన మహనీయుడని కొనియాడారు. ఎందరో భారత వీరులకు మార్గ దర్శకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని అన్నారు. విద్యార్థులు నైతిక విలువలను పెంచుకుంటూ, క్రమ శిక్షణగా ఉంటూ, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ , క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు తేజేశ్వరరావు, దివాకర రావు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల కోసం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కిషోర్, తదితరులు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పథకానికి సంబంధించి కాకినాడ పట్టణంలోని జర్నలిస్టులకు అందించే ఇళ్ల స్థలాలకు కాకినాడ ఆర్‌డిఒ కిషోర్ ఆధ్వర్యంలో అధికారులు సామర్లకోటలో స్థల పరిశీలన చేశారు. స్థానిక తహశీల్దార్ ఎస్ఎల్ఎన్. కుమారి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక భాస్కర్ నగర్ కాలనీ అమ్మానమ్మ అపార్ట్మెంట్ మధ్యలో ఉన్న ఏడు ఎకరాల స్థలాన్ని జిల్లా అక్రిడియేషన్ కమిటీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. పట్టణా నికి చెందిన కాటూరి జానకిరామ్, వారి బంధు వులకు చెందిన పొలాలను అధికారులు పరిశీలించి కమిటీ నాయకుల సమ్మతిని తెలుసుకున్నారు. కాకినాడ పట్టణానికి చెందిన పాత్రికేయులకు 9 ఎకరాల స్థలాలు అవసరం ఉండగా ఇప్పడి వరకు కాకినాడ రూరల్‌లోని పండూరు గ్రామంవద్ద మరికొన్ని చోట్ల స్థలాలను పరిశీలించగా అవి అంత అనువుగా లేవని ఆర్‌డిఒకిషోర్ చెప్పారు. సామర్ల కోట చిన్నపాటి సర్దుబాటులతో లే అవుట్ చేసుకునేం దుకు స్థలం అనువుగా ఉన్నట్టు చెప్పారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు నివేదికను అందిస్తామని చెప్పారు.


లవకుశలో నటించడం పూర్వజన్మ సుకృతం



ప్రజాశక్తి - పెద్దాపురం

లవకుశ పౌరాణిక సినిమాలో తాను కుసుడు పాత్రలో నటించటం తన పూర్వ జన్మ సుకృతమని ఉయ్యూరి నాగ సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళ వారం ఆయన స్థానిక న్యాయ వాది చిటికెన కనక దుర్గారావు ఇంటికి వచ్చిన సందర్భం గా విలేకర్ల సమావేశంలో మాట్లా డుతూ లవ కుశ సినిమాలో నటించిన వారందరూ మరణించగా తాను మాత్రమే జీవించి ఉన్నా నన్నారు. వెండి తెరకు దూరమైన తర్వాత తాను బుర్రకథలు చెప్పటం ప్రారంభించి పదివేల ప్రదర్శనలు ఇచ్చానన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పుట్టా సోమన్న చౌదరి, హరి గోపాల శర్మ, కనకదుర్గారావు, శ్రీనివాస రావు పాల్గొన్నారు.

అర్బన్ తహశీల్దార్‌గా చల్లన్నదొర



కలెక్టర్‌ను కలిసిన తహశీల్దార్ చల్లన్నదొర

ప్రజాశక్తి - కాకినాడ

సాధారణ బదిలీలలో భాగంగా ఏలూరు కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కె..చల్లన్న దొర కాకినాడ అర్బన్ తహశీల్దార్‌గా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డిఆర్‌ఒ కె.శ్రీరమణిలను మర్యాదపూర్వకంగా కలిశారు.

హోరాహోరీగా సాగుతున్న లాన్ టెన్నిస్ టోర్నమెంట్



లాన్ టెన్నిస్‌లో పోటీ పడుతున్న క్రీడాకారులు

ప్రజాశక్తి - కాకినాడ

జాతీయ స్థాయి అండర్ 19 బాలుర లాన్ టెన్నిస్ టోర్నమెంట్ నాల్గవ రోజు స్ఫూర్తి దాయకంగా మంగళవారం జరిగాయి. 4వ రోజు 18 మ్యాచ్‌లు నిర్వహించారు. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ రిషి వర్ధన్ (కర్ణాటక)- వహీన్ పటేల్ (గుజరాత్) మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ నందు వహీన్ పటేల్ 7-5 స్కోరుతో విజయం సాధించారు. అర్జున్‌రాఠీ (హర్యానా), జాన్ రోహన్ (తమిళనాడు) మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ లో అర్జున్ రాఠీ 6-4 స్కోరుతో విజయం సాధిం చారు. అవాం పారిఖ్ (గుజరాత్) శాండిల్య (తెలంగాణ) మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్లో శాండిల్య (తెలంగాణ) 7-5 స్కోరు తో విజయం సాధించారు. అశ్వజీత్ సెంజమ్ (చండీగఢ్) వి.ధీరజ్ (తెలంగాణ) మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్లో పోటీలో 6-4 స్కోరు తో అశ్వజీత్ సెంజమ్ విజయం సాధించారు. జాతీయ పరిశీలకులు కె.రామి రెడ్డి ఆడిన క్రీడా కారులను పరిచయం చేసుకున్నారు. ఈ జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు, అధికా రులు, ఉపాధ్యాయులతో క్యాంపు ఫైర్ ను నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యాశాఖాధికారిణి జి.నాగ మణి, పాఠశాల గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఛైర్మన్ జి.భానుమూర్తి రాజు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బివివిఎస్‌వి ప్రసాద్, ఉప విద్యాశాఖాధికారులు ఆర్‌జె.డేనియల్ రాజు, డి.సుభద్ర, డిఎస్‌డిఒ బి.శ్రీనివాసకుమార్, పాల్గొన్నారు.

రహదారి సమస్య సత్వర పరిష్కారానికి కృషి



మహిళలతో మాట్లాడుతున్న వరుపుల

ప్రజాశక్తి - శంఖవరం

మండలంలోని దశాబ్ద కాలం నుంచి శంకవరం నుంచి వేలంగి రహదారి సమస్య అలానే ఉందని, ఆ సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రతిపాడు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సుబ్బారావు అన్నారు మంగళవారం వేలంగి, పి.మల్లాపురం, శృంగధార, గౌరంపేట గ్రామాల్లో ఎంపిపి పర్వత రాజబాబుతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం నూతన వ్యవస్థలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ పర్యటనల్లో ఈగల రాజబాబు, పర్వత వివేక్, మల్లాపురం సర్పంచ్ పసగొడుగుల నాగేశ్వరరావు, పడాల దొంగబాబు, రేలంగి సూరిబాబు, బైరా రాంబాబు, బండి లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా సందడి



చిత్రం షూటింగ్‌లో హీరో, హీరోయిన్

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

స్థానిక ఉప్పాడ, కొత్తపల్లి లో గ్రామాల్లో సినిమా సందడి నెలకొంది. మంగళ వారం స్థానిక వివిఎస్ విద్యా సంస్థల ప్రాంగణంలో యముడు చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ఉప్పాడ, కొత్తపల్లి కాకినాడ తదితర ప్రాంతాలలో యముడు షూటింగ్ చిత్రీకరణ చేయడం జరిగింది. జగన్నాథ పిక్చర్స్ బేనర్‌పై నిర్మాత, దర్శకత్వం, హీరోగా జగదీష్ ఈ చిత్రాన్ని తీస్తున్నారు. తాను హీరోగా నటిస్తున్న యముడు చిత్రంలో హీరోయిన్‌గా శ్రావణి, మరొక హీరోగా ఆకాష్, హీరోయిన్‌గా అనూషరాజు నటిస్తున్నారన్నారు ఈ చిత్రం గరుడ పురాణానికి సంబంధించినదని, మానవులు పుట్టినదే మొదలు మరణించిన అనంతరం యమలోకంలో వారికి విధించే శిక్షల గురించి గరుడ పురాణంలో ఏ విధంగా ఉంటుందో దానిని చిత్రీకరించడం జరుగుతుందన్నారు. ఈ చిత్రానికి ప్రొడక్షన్ మేనేజర్‌గా కొత్తపల్లి గ్రామానికి చెందిన గుండ్ర రామకృష్ణ వ్యవహరిస్తున్నారు.

నిత్యవసర సరుకుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న నాసా ప్రతినిధులు

ప్రజాశక్తి - కోటనందూరు

భీమవరపుకోట గ్రామంలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో బాధితులైన సిలి దుర్గ భవాని కుటుంబానికి నాసా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శ్రీను, స్వర్ణ, దళిత ప్రగతి ఐక్య సంఘ అధ్యక్షులు చిన్న నూకరాజు నిత్యవసర సరుకులు, దుప్పట్లు, దస్తులు అందచేశారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ బాధితులను ఆదుకోవడంలో నాసా ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అల్లు చంద్రరావు, గణేష రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

ప్రజాశక్తి - కోటనందూరు

ప్రజల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి శ్రీనివాస్ అన్నారు. మంగళ వారం ఇందుగపల్లి గ్రామంలో జెఎఎస్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా మారుమూల ప్రాంతాల్లోనూ విలేజ్ క్లినిక్లను ఏర్పాటు చేసి ప్రజలకు అన్ని రకాల వైద్య పరీక్షలను అందుబాటులో తెచ్చారని అన్నారు. ప్రజలకు అవసరమైన విద్య, వైద్య రంగాలలో అత్యధిక నిధులు కేటాయించే మెరుగైన సేవలను అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంచే సత్యవతి, అచ్చిరాజు, మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, లంక ప్రసాద్, గొర్ల రామచంద్ర రావు, సుర్ల రాజు, సుర్ల రాంబాబు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొండపోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

గిరిజనులు సాగులో ఉన్న జె.అన్నవరం, పరిమితడక గ్రామాల కొండపోడు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని గిరిజన సంఘం(సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రా పార్టీ) ఆధ్వర్యంలో ఆదివాసీలు స్థానిక తాసిల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు కోసిరెడ్డి గణేష్ మాట్లాడుతూ 149 గిరిజన కుటుంబాలు గత 30 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ విషయమై అనేక పోరాటాలు చేశారని, ఐటిడిఎ పిఒ వెంటనే గ్రామ సభ తీర్మానాలు తీసుకురావాలని ఏలేశ్వరం, అడ్డతీగల తహశీల్దార్‌లను ఆదేశించారని తెలిపారు. వెంటనే గ్రామ సభ తీర్మానాలు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మండల టిడిపి అధ్యక్షుడు మోహనరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను మంగళవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. **కాకినాడ** అర్బన్ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మాజీ ఎంఎల్‌సి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు పాల్గొని కేక్‌ను కట్ చేశారు. కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, రూరల్ నాయకులు పేరాబత్తుల రాజశేఖర్, నులుకుర్తి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబా, రహీమ్, దండుప్రోలు నాగబాబు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ మేయర్‌ఖ్ సుంకర పావని ఆధ్వర్యంలో స్థానిక సంత చెరువు ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్‌ను కట్ చేసిన అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నున్న దొరబాబు, పెనుబోతు తాతారావు, మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల బున్నీ, బొబ్బిలి గోవింద్, తదితరులు పాల్గొన్నారు. **గండేపల్లి** మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, గ్రామ అధ్యక్షులు ఎలమటి కాశీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద లోకేష్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మండల టిడిపి నాయకులు ఎర్రంశెట్టి బాబ్జి, ఇప్పర్ల బాబి, వెంపటి రాజు, ఆళ్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ కుమారుడు పిల్లి కృష్ణ కల్యాణ్ ఆధ్వర్యంలో వలసపాకల గ్రామంలో లోకేష్ పుట్టిన రోజు వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి టిడిపి శ్రేణులు స్వీట్లు తినిపించుకున్నారు. అనంతరం సుమారు 200 మంది పేద ప్రజలకు దుస్తుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కర్రి వెంకటరాజు, తెలుగు యువత మాజీ అధ్యక్షులు బోళ్ల కృష్ణమోహన్, జడ్‌పికో ఆప్షన్ సభ్యులు మట్టా ప్రకాష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.